


మార్కెటింగ్ శాఖ కమిషనర్ రాహుల్ పాండే నేడు రాక

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కమిషనర్, మార్క్ ఫెడ్ ఎమ్‌డి రాహుల్ పాండే శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నట్టు ఆ శాఖ సహాయ సంచాలకులు వైవి శ్యాంకుమార్ తెలిపారు. తన పర్యటనలో భాగంగా జిల్లాలో పలు మార్కెట్ యార్డులు, రైతుభరోసా కేంద్రాలు, రైతుబజార్‌లను కమిషనర్ సందర్శిస్తారని, జిల్లా కేంద్రంలో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కార్యకలాపాలపై సమీక్షిస్తారని పేర్కొన్నారు. కమిషనర్ రాహుల్ పాండే తొలుత విజయనగరం మార్కెట్ యార్డును సందర్శించి అనంతరం అక్కడే జిల్లాలో మార్కెటింగ్‌శాఖ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం ఆర్ అండ్ బి రైతుబజార్‌ను సందర్శిస్తారని, నెల్లిమర్ల మండలం గుషిణిలోని ఎంపిఎఫ్‌సి గోడౌన్‌ను సందర్శిస్తారని పేర్కొన్నారు. భోగాపురంలోని వేబ్రిడ్జిని, పూసపాటిరేగ మండలం కొప్పెర్లలో రైతుభరోసా కేంద్రాన్ని సందర్శించి అనంతరం విశాఖ వెళతారని పేర్కొన్నారు.

సీతారాముల కల్యాణోత్సవం

శోభాయమానం



కళ్యాణం సందర్భంగా తాళి బొట్టు చూపిస్తున్న అర్చకులు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

శ్రీరామనవమి సందర్భంగా రామతీర్థంలో సీతారాముల కల్యాణోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ప్రభుత్వం తరపున రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ దంపతులు స్వామి వారి కల్యాణానికి ముత్యాల తాలంబ్రాలు, పట్టు వస్త్రాలను సమర్పించారు. గోటి తో వొలిచిన 28 కేజీల తలంబ్రాలను కల్యాణానికి వినియోగించారు. టిటిడి నుండి, సింహాచలం నుండి విచ్చేసిన వేద పండితుల ఆధ్వర్యంలో కల్యాణం వైభవంగా జరిగింది. ప్రముఖ పండితులు మైలవరపు శ్రీనివాస రావు వ్యాఖ్యానం ఆద్యంతం సందేశాత్మకంగా నిలిచింది. 40మంది ఋత్వికులు, అర్చకులు శ్రీమద్రామాయణ పారాయణం, సుందరాకాండ పారాయణం, సుందర కాండ విశేష హవనం, దివ్య ప్రబంధ సేవా, శత సహస్ర నామ తులసీ దళార్చన, కుంకుమార్చన, ఆరాధన, బాల భోగం, తీర్థ గోష్ఠి, రామచంద్ర స్వామి అవతార సర్గ విన్నపం నిర్వహించారు. అనంతరం సీతారామ లక్ష్మణులను ప్రత్యేక వాహనంలో దేవస్థానం కల్యాణ మండపంలోకి తీసుకు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిజిత్ లగ్నంలో సీతారాముల కళ్యాణం మహోత్సవాలు ప్రారంభించి కంకణ ధారణ, జీలకర్ర బెల్లం, గోటి తలంబ్రాలు, ముత్యాల తలంబ్రాలు కార్యక్రమాలు నిర్వహించి మధ్యాహ్నం 12గంటలకు సీతారాముల కళ్యాణాన్ని అర్చకులు జరిపించారు.

పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి బొత్స దంపతులు

కల్యాణోత్సవంలో మంత్రి బొత్స సత్యనారాయణ, ఝాన్సీలక్ష్మి దంపతులు, వారి కుటుంబ సభ్యులు, నెలిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు, పద్మావతి దంపతులు, ఎంపి బెల్లాన చంద్ర శేఖర్, ఎంఎల్‌సి డాక్టర్ సురేష్ బాబు పాల్గొన్నారు. తొల్గుత జె.సి. మయూర్ అశోక్, ఆర్‌డిఒ సూర్య కళ, దేవస్థానం ఇఒ కిశోర్ తదితరులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి వేదం మంత్రాలతో మంత్రిబొత్స, ఎమ్మెల్యే, జిల్లా జడ్జి కల్యాణ చక్రవర్తిని దేవాలయంలో సీతారాముల దర్శనానికి తీసుకు వెళ్లారు. అనంతరం కల్యాణ వేదిక వద్ద జరిగిన వేడుకలో పాల్గొన్నారు.



పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ, మాజీ ఎమ్‌పి బొత్స ఝాన్సీ లక్ష్మి దంపతులు

అనంతరం మంత్రి బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ స్వామి వారి ఆశీస్సులు ఈ ప్రభుత్వం పైనా, రాష్ట్ర ప్రజలందరి పైనా ఉండాలని కోరుకుంటున్నానని అన్నారు. పాడి పంటలు సమృద్ధిగా పండి, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, రామతీర్థం మరో భద్రాచలంగా చెప్పుకోవచ్చునని, భద్రాచలంలో మాదిరిగానే ఇక్కడా అలాంటి సంప్రదాయంతో కళ్యాణోత్సవాలు నిర్వహించడం సంతోషాదాయకంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో పైడితల్లి దేవస్థానం ఇఒ సుధారాణి, ఎంపిపి అంబళ్ళ సుధారాణి, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు అంబళ్ళ శ్రీ రాములు నాయుడు, మున్సిపల్ కమిషనర్, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రేగానశ్రీని వాస రావు, ఎంపిడిఒ తహశీల్దార్, నగర పంచాయితీ ఛైర్మన్ బంగారు సరోజినీ, వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావు, మాజీ ఎంపిపి మత్స విజయ, నాయకులు మత్స సత్య నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ సాగులో..

పెరగనున్న యాంత్రీకరణ

- 40 శాతం రాయితీపై కస్టమ్ హైరింగ్ సెంటర్లు
- 81ఆర్‌బికెల్లో ముందుకు రాని రైతులు



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో క్రమంగా వ్యవసాయ యాంత్రీకరణ పెరుగుతోంది. ఓవైపు సొంత ట్రాక్టర్లు, ఇతర వ్యవసాయ పరికరాలు, మరోవైపు ప్రభుత్వ సహకారంతో కస్టమ్ హైరింగ్ సెంటర్ల ఏర్పాటు పెరుగుతుండడమే ఇందుకు తార్కాణంగా చెప్పుకోవచ్చు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా ప్రభుత్వం 40 శాతం రాయితీపై కస్టమ్ హైరింగ్ సెంటర్లు (ట్రక్కులు, దుక్కిసెట్లతో కూడిన ట్రాక్టర్లు, కలుపుతీత, వరికోత తదితర వ్యవసాయ యంత్రాలు)ను ప్రోత్సహిస్తున్న విషయం విధితమే. ప్రభుత్వం ప్రతి ఆర్‌బికె పరిధిలోనూ ఐదు నుంచి ఆరుగురు రైతులకు రూ.15లక్షల విలువగల కస్టమ్ హైరింగ్ సెంటర్లు మంజూరు చేస్తోంది. ఇందులో 10శాతం లబ్ధిదారుడి వాటా కాగా 50శాతం బ్యాంకు రుణం మంజూరు చేస్తుంది. మిగిలిన 40శాతం ప్రభుత్వం సబ్సిడీ రూపంలో భరిస్తుంది. వీటిని తీసుకున్న రైతులు వారి సొంత అవసరాలకు ఉపయోగించుకోవడంతోపాటు స్థానికంగా వున్న ప్రైవేటు యంత్రాలకు తీసుకుంటున్న అద్దెకన్నా 10శాతం తగ్గింపుతో సేవలు అందించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. జిల్లాలో 500ఆర్‌బికెలు ఉండగా ఇప్పటి వరకు 324 ఆర్‌బికెల్లో రైతులు గ్రూపులుగా ఏర్పడి వీటిని తీసుకున్నారు. మిగిలిన 176 ఆర్‌బికెల్లో రైతులను గ్రూపులుగా ఏర్పాటుచేయాలని అధికార యంత్రాంగం భావిస్తోంది. కానీ, వీటిలో కేవలం 95ఆర్‌బికెల నుంచి మాత్రమే రైతు గ్రూపుల నుంచి దరఖాస్తులు అందాయని వ్యవసాయ శాఖ జిల్లా అధికారులు చెబుతున్నారు. మొత్తంగా పరిశీలిస్తే కొత్తగా వచ్చిన దరఖాస్తులను కలుపుకుంటే జిల్లా వ్యాప్తంగా 423 కస్టమ్స్ హైరింగ్ కేంద్రాలు ఉన్నట్టు లెక్క. మరోవైపు ట్రాక్టర్లు దాదాపు అన్ని గ్రామాల్లో ఉన్నాయి. ఈలెక్కన వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ క్రమంగా పెరుగుతోందని రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు విశ్లేస్తున్నారు.

రైతులు ఉపయోగించుకోవాలి




ప్రభుత్వం వ్యవసాయ యాత్రీకరణ ప్రోత్సహిస్తోంది. కస్టమ్ హైరింగ్ సెంటర్ల ఏర్పాటు ద్వారా చిన్న సన్నకారు రైతులకు వ్యవసాయ యంత్రాలు అందుబాటులో ఉంచాలన్నది ప్రభుత్వ సంకల్పం. ప్రభుత్వం ద్వారా వీటిని పొందిన రైతులు తమ సొంత అవసరాలకు వినియోగించుకోవడంతో పాటు ప్రైవేటు యంత్రాల అద్దెపై 10శాతం తక్కువకు సేవలందించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు పొందిన ఆర్‌బికె పరిధిలోని ఐదు నుంచి ఆరుగురు రైతులు కలిపి కస్టమ్ హైరింగ్ సెంటర్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. జిల్లా కో-ఆపరేటివ్ బ్యాంకు ద్వారా ప్రభుత్వం మంజూరు చేస్తుంది.

- టి.రామారావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

వైసిపికి మరిశర్ల గుడ్‌బై

కౌన్సిలర్ పదవికీ రాజీనామా

ప్రజాశక్తి-బొబ్బిలి



మరిశర్ల రామారావునాయుడు

బొబ్బిలి మున్సిపాలిటీలో వైసిపికి గట్టి దెబ్బతగిలింది. వైసిపి సభ్యత్వానికి, మున్సిపల్ కౌన్సిలర్ పదవికి 21వ వార్డు కౌన్సిలర్ మరిశర్ల రామారావునాయుడు రాజీనామా చేశారు. సాహితీ నగర్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసిపి ఆవిర్భావానికి ముందు నుంచి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి, సిఎం జగన్మోహన్ రెడ్డితో కలిసి పని చేసినప్పటికీ తనకు తగిన గుర్తింపు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి ఆవిర్భావం నుంచి పనిచేసిన నాయకులకు గుర్తింపు లేకపోవడంతో నేడు పార్టీకి దూరమవుతున్నారని ఆరోపించారు. ప్రస్తుత ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ఏపార్టీ అధికారంలోకి వస్తే ఆపార్టీలో చేరుతారని పరోక్షంగా విమర్శించారు. 2019 ఎన్నికలకు ముందు సాహితీనగర్‌లో భారీ బహిరంగ సభ పెట్టి నియోజకవర్గంలో మంచి ఊపు తీసుకువచ్చామని చెప్పారు. 2019 ఎన్నికల్లో వైసిపి విజయానికి కష్టపడి పనిచేసినా గుర్తింపు ఇవ్వడం లేదన్నారు. తనను నమ్ముకున్న ప్రజలకు న్యాయం చేయలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. 21వ వార్డు సమస్యలను ప్రస్తావిస్తే పట్టించుకోలేదన్నారు. బొబ్బిలి, పార్వతీపురం నియోజకవర్గాల్లో అత్యధిక సభ్యత్వం చేయడంతో అప్పట్లో భూమా నాగిరెడ్డి అభినందించారని గుర్తుచేశారు.

మరోవైపు ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు దగ్గరయ్యామని చెప్పారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటామన్నారు. లైవ్ బ్లడ్ బ్యాంకు ద్వారా రక్తదానం చేసి ఎంతోమంది ప్రాణాలను కాపాడినట్లు చెప్పారు. కరోనా సమయంలో జగనన్న హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి కష్టాల్లో ఉన్నవారిని ఆదుకున్నట్లు వెల్లడించారు. పేద విద్యార్థుల చదువు కోసం ఆర్థిక సహాయం చేశామన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సాయం అందించామని తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన వారికి పదవులు ఇవ్వకుండా, పనిచేయని వారికి పదవులు ఇచ్చారని ఆరోపించారు. తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని చెప్పారు. కౌన్సిలర్ పదవికి రాజీనామా లేఖను మున్సిపల్ కమిషనర్‌కు, పార్టీ సభ్యత్వానికి రాజీనామా లేఖను పట్టణ అధ్యక్షులకు అందజేస్తామని చెప్పారు.

పది పరీక్షలకు సన్నద్ధం

మెరుగైన ఫలితాలే లక్ష్యంగా కృషి • ఏప్రిల్ 3 నుంచి 18 వరకు పరీక్షలు

పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో ఈ ఏడాది మెరుగైన ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు కదులుతున్నారు. ఆ దిశగా విద్యార్థులను సానపడుతున్నారు. వెనుకబడిన విద్యార్థులను గ్రేడ్‌లుగా విభజించి ఉపాధ్యాయులు వారి బాధ్యత తీసుకొని దగ్గరుండి చదివిస్తున్నారు. పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం వీరికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జిల్లా వ్యాప్తంగా 25,481మంది విద్యార్థులు ఈ ఏడాది టెన్త్ పరీక్షలు రాయనున్నారు. జనవరి నెలాఖరుకే ఉపాధ్యాయులు సిలబస్ పూర్తి చేసి, పునశ్చరణ చేయించారు. ఏ సబ్జెక్టులో విద్యార్థులు వెనుకబడి ఉంటే, అందులో అదనపు తరగతులు నిర్వహించారు. 100 రోజుల ప్రణాళిక, రోజువారీ పరీక్షలు, గ్రాండ్ టెస్టులు, ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించి విద్యార్థులను సిద్ధం చేశారు.



ప్రత్యేక తరగతుల్లో చదువుతున్న విద్యార్థులు

సెల్ఫ్ టెస్ట్‌ల పేరుతో ప్రత్యేక శ్రద్ధ

సెల్ఫ్ టెస్టులో పేరుతో విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ప్రస్తుతం పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయుల్లో ఒక్కొక్కరు కొంతమంది వెనుకబడిన విద్యార్థులను దత్తత తీసుకొని చదివించే బాధ్యత తీసుకున్నారు. తరగతి గదిలో చెప్పే పాఠాలలో ఏదైనా సందేహాలు కలిగినప్పుడు వాటిని పాఠశాల ముగిసిన అనంతరం నిర్వహించే శిక్షణా తరగతులలో నివృత్తి చేస్తున్నారు. విద్యా శాఖ ఆదేశాలు ప్రకారం ఉదయం 8 గంటల నుంచి 9 వరకు మధ్యాహ్న 4 గంటల నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. సెల్ఫ్ టెస్ట్ పేరుతో ప్రతి రెండు పాఠ్యాంశాలు పూర్తి అయిన వెంటనే పరీక్ష నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో పూర్తి కాన్ఫిడెన్స్ పెరగడానికి దోహదపడింది.

తల్లిదండ్రులతో సమావేశాలు

పిల్లల చదువు పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లితండ్రుల సమావేశాల నిర్వహించారు. ప్రతి విద్యార్థి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను కలిసే విధంగా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. గతంలో రెండు పేపర్ల విధానం ఉండేటప్పుడు ఒత్తిడి లేకుండా పరీక్ష రాసేవారు. ఇప్పుడు రెండు పేపర్లు కలిపి ఒకే రోజు నిర్వహించడం వల్ల సమయం సమయాన్ని ప్రణాళికాయుతంగా మార్చుకుని పరీక్షలంటే ఆందోళన చెందకుండా మంచి మార్కులు వచ్చేలా ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేశారు.

గ్రేడ్లుగా విభజించి ప్రత్యేక తరగతులు

గతేడాది పరిస్థితి పునరావృతం కాకుండా ఉండాలనే లక్ష్యంతో గణితం, సైన్సు పాఠ్యాంశాలపై ప్రత్యేక దృష్టి సారించి తర్ఫీదునిచ్చారు. ఎస్ఎ-1 పరీక్షలలో ఫలితాల ఆధారంగా విద్యార్థులను ఎ, బి, సి, డి గ్రేడ్లుగా విభజించి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు.

ప్రణాళికతో చదువుతున్నా



ఈ ఏడాది ఆరు పేపర్లు కావడం, అందులో సైన్స్ పేపర్ పార్ట్-ఎలో భౌతిక, రసాయనశాస్త్రం, పార్ట్-బిలో జీవ శాస్త్రం ఉండటంతో ప్రత్యేక ప్రణాళికతో చదువుతున్నాం. గతంలో రెండు పేపర్ల విధానం ఉండేది. ఇప్పుడు రెండు పేపర్లు కలిపి ఒకే రోజు నిర్వహించడం వల్ల సమయం చాలదు. అందుకనే సమయాన్ని ప్రణాళికాయుతంగా మార్చుకుని పరీక్షలంటే ఆందోళన చెందకుండా మంచి మార్కులు. వచ్చేలా ఉపాధ్యాయులు మార్గ నిర్దేశం చేశారు.

- పి.చిరుహాసిని, జెడ్‌పి హైస్కూల్, సారిపల్లి

సందేహాలన్నీ నివృత్తి చేశారు



తమకున్న సందేహాలన్నింటినీ ఉపాధ్యాయులు నివృత్తి చేశారు. అర్థం కాకపోతే పదే పదే చెప్పారు. ప్రత్యేక తరగతులు నిర్వహించి చదివించారు. 590కు పైగా మార్కులు వస్తాయన్న నమ్మకం ఉంది.

- ఐ.లోకేష్, కంటోన్మెంట్ హైస్కూల్, విజయనగరం

సి, డి గ్రేడ్ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ



గత ఏడాది కంటే మెరుగైన ఫలితాలు వస్తాయి. సి, డి గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. ప్రత్యేక ప్రణాళికతో పరీక్షలకు సిద్ధం చేశాం. మా స్కూలులో వంద మంది విద్యార్థులు హాజరవుతున్నారు. కనీసం పది మంది అయినా 550కు పైగా మార్కులు సాధించేలా శ్రద్ధ పెట్టాం. అత్యధికంగా టెస్ట్ లు, సెల్ఫ్ టెస్ట్ లు నిర్వహించడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయనే నమ్మకం ఉంది.

- ఎం.కాంచన, హెచ్‌ఎం, కంటోన్మెంట్ హైస్కూల్,విజయనగరం


పరీక్షలంటే భయం పోగొట్టారు



ఒత్తిడి లేకుండా పరీక్షలకు సిద్ధం చేశారు. రోజువారీ పరీక్షలు, అదనపు తరగతులు నిర్వహించి పబ్లిక్ పరీక్షలంటే భయం పోగొట్టారు. పరీక్షలు బాగారాసి మంచి మార్కులు తెచ్చుకుంటాం.

-ఎస్. బీరజ్, కంటోన్మెంట్ హైస్కూల్, విజయనగరం

స్టడీ అవర్‌తో ప్రయోజనం



స్టడీ అవర్స్‌తో చాలా ప్రయోజనం కలిగింది. చదువుతుండగానే ఎక్కువ సందేహాలు వస్తుంటాయి. వాటిని అప్పుడే మా టీచర్స్ నివృత్తి చేశారు. ప్రతిరోజు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ తరగతుల్లో మా నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని పట్టుదలతో ఉన్నాం.

- కొల్లి కూర్మారావు, జెడ్‌పి హైస్కూల్, సారిపల్లి

ఉత్తమ ఫలితాలు సాధిస్తాం..



మా పాఠశాల నుంచి 51 మంది విద్యార్థులకు పరీక్షలకు హాజరవుతున్నారు. సిలబస్‌ను సకాలంలో పూర్తి చేశాం. ఈ ఏడాది పరీక్ష పేపర్ మోడల్ మారిన కారణంగా విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు విద్యాశాఖ ప్రత్యేకంగా నిర్వహించిన 7 సెల్ఫ్ టెస్టులు, 3 గ్రాండ్ టెస్ట్ లు, ఒక ప్రీ ఫైనల్ ద్వారా విద్యార్థులు బాగా ప్రాక్టీసు చేయడానికి, వారిలో అవగాహన కలగడానికి ఉపయోగపడింది. విద్యార్థులను బాగా చదివించాం. మంచి ఫలితాలు సాధిస్తారు.

- డి.రాము, హెచ్‌ఎం, సారిపల్లి జెడ్‌పి హైస్కూల్



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

కాలువ, రహదారి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో శంకుస్థాపన వారోత్సవాల్లో భాగంగా గురువారం 28, 29, 30 డివిజన్లో వివిధ అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి శ్రీకారం చుట్టారు. సుమారు రూ.42లక్షలతో రహదారులు, కాలువలు, కల్వర్టుల వంటి మౌలిక సదుపాయాల కల్పనకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కృషి చేస్తున్నారన్నారు. ఏప్రిల్ ఆరో తేదీ నుండి పూర్తయిన పనులకు వారం రోజుల పాటు ప్రారంభ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేవతి దేవి, జోనల్ ఇన్‌ఛార్జి కోలగట్ల కృష్ణారావు, యువజన నాయకులు ఈశ్వర్ కౌశిక్, డివిజన్ కార్పొరేటర్లు జకీర్ హుస్సేన్, పతివాడ గణపతి రావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ చర్చా వేదిక

ప్రజాశక్తి-రేగిడి

స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో శుక్రవారం సామాజిక తనిఖీ చర్చా వేదిక నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ జి.కాశీవిశ్వనాథరావు, ఎపిఒ ఎస్.హరినాథ్ తెలిపారు. 2021 ఏప్రిల్ నుండి 2022 మార్చి వరకు రూ.17 కోట్లతో చేపట్టిన పనులకు చర్చావేదిక ఉంటుందని తెలిపారు. ఇప్పటికే గ్రామాల్లో డిఆర్‌పి, ఎస్ఆర్‌పిలతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించామని చెప్పారు. ఈ చర్చా వేదికకు జిల్లాస్థాయి అధికారులు రానున్నట్లు తెలిపారు. మండల సర్పంచులు, ఎంపిటిసిలు, ఉపాధి సిబ్బంది తప్పక హాజరు కావాలని కోరారు.

24 గంటల్లో పక్షవాతం నుంచి కోలుకుని..

ప్రజాశక్తి-బొబ్బిలి



పక్షవాతం నుంచి కోలుకున్న అంగన్‌వాడీ కార్యకర్త సూరమ్మ

పక్షవాతం బారిన పడిన పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త కె.సూరమ్మ 24 గంటల్లో కోలుకున్నారు. ఈనెల 28న ఉదయం 11గంటల సమయంలో పక్షవాతం బారిన పడడంతో ఎడమ చెయ్యి, కాలు పూర్తిగా పని చేయలేదు. మూతి వంకరై మాటలు రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బొబ్బిలిలో ఉన్న నారాయణి హార్ట్ కేర్ ఆసుపత్రిలో చేర్పించారు. రోగికి వైద్యులు పి.సునీల్ సిటీ స్కాన్ చేయించి మెదడులో రక్తం గడ్డ కట్టినట్లు గుర్తించారు. మధ్యాహ్నం 3.30గంటల సమయంలో టెనెక్ట్ ప్లేస్ ఇంజెక్షన్ చేయగా ఐదు గంటల్లో చెయ్యి, కాలు పని చేశాయి. 24గంటల్లో మూతి వంకర నయం అవ్వడంతో మాటలు బాగా ఆడడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పక్షవాతం వచ్చిన ఆరు గంటలలోపు ఆసుపత్రిలో చేరితే వ్యాధిని నయం చేయవచ్చునని వైద్యులు సునీల్ అన్నారు. కళ్లు తిరిగినట్లు, కాలు, చెయ్యి పని చేయకపోవడం, మాట తొత్తురబాటు వస్తే పక్షవాతం లక్షణాలు అని చెప్పారు.

గురువులను కించపరచడం తగదు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

పదో తరగతి పరీక్షల్లో పొరపాటు చేసిన ఉపాధ్యాయులను ఈ ఏడాది టెన్త్ పరీక్షల సమయంలో తహశీల్దార్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు డి.రాము, జిల్లా కార్యదర్శి పి.త్రినాథ్, మండల గౌరవాధ్యక్షులు ఎం.రామారావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎం.సత్యనారాయణ, కె.శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి పరీక్షలలో మాల్ ప్రాక్టీసుకు సహకరించారని ఉపాధ్యాయులపై గతంలోనే చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఇప్పుడు మళ్లీ వారిని పరీక్ష ముగిసే వరకు తహశీల్దార్ వద్ద రిపోర్ట్ చేయాలని ఆదేశించడమంటే ఉపాధ్యాయులను ముద్దాయిలుగా చిత్రీకరించడమేనని చెప్పారు. పరీక్షల సమయంలో ఇన్విజిలేటర్ సెల్‌ఫోన్ తీసుకురాకుండా నిబంధనలు అమలు పరచాలని కోరారు. అవసరమైతే పొరపాటు చేసిన ఉపాధ్యాయులకు పదో తరగతి ఇన్విజిలేషన్ డ్యూటీ వేయకుండా ఉండాలి తప్ప వారి మనోభావాలను దెబ్బతీయవద్దని విజ్ఞప్తిచేశారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

మెగా డిఎస్‌సి విడుదల చేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశకి-విజయనగరం టౌన్

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డివైఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు హరీష్, రుద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులును భర్తీ చేయాలన్నారు. ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, డిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క డిఎస్‌సి కూడా నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయకుండా నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం ఆడుకుంటోందన్నారు. డిఎస్‌సిలో 25 వేలకు పైగా ఖాళీలు ఉన్నప్పటికీ ఇప్పటివరకు భర్తీ చేయలేదన్నారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ కేవలం 717 ఉపాధ్యాయ పోస్టులు మాత్రమే ఖాళీగా ఉన్నాయని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. నూతన జాబ్ క్యాలెండర్, మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని, లేదంటే నిరుద్యోగులందరినీ ఏకం చేసి పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సతీష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దాసన్నపేట 11 కెవి లైన్‌లో చెట్ల కొమ్మలు శుక్రవారం కొడుతున్నందున ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్తుశాఖ ఎస్‌ఇ నాగేశ్వరరావు తెలిపారు. దాసన్నపేట, రైతు బజార్, గుమ్చీ, శంకరమఠం, గొడ వీధి, సుంకరి వీధి ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు.ఆ ప్రాంత ప్రజలు సహకరించాలని కోరారు.

శృంగవరపుకోట మండలంలోనూ..

శృంగవరపుకోట : బొడ్డవర వద్ద 33/11 కెవి సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగనుందని ఆ శాఖ ఎఇ ఆర్.రవికుమార్ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒక గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపేస్తున్నట్లు చెప్పారు. తెన్నుబొడ్డవర, భవానీ నగర్, గౌరీపురం, ఆడ్డతీగ, రాజపేట, కుమారం, మరుపల్లి, కెఎస్.పురం, పెద్దఖండేపల్లి, తాటిపూడి, ఆమ్మపాలెం తదితర గ్రామాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ఆయా గ్రామస్తులు సహకరించాలని కోరారు.

నెలకే బీటలు

రోడ్డు పనుల్లో నాణ్యతకు తిలోదకాలు

ప్రజాశక్తి-వేపాడ

సోంపురం కూడలి నుంచి ఆనందపురం కూడలి వరకు మండల కేంద్రం వేపాడ మీదుగా చేపడుతున్న రోడ్డు పనుల్లో నాణ్యతను గాలికొదిలేశారు. అధికారుల పర్యవేక్షణ కరువవడంతో కాంట్రాక్టరు ఇష్టానుసారంగా నిర్మాణం చేపట్టారు. ఫలితంగా నెల రోజులు గడవకముందే భరతవానిపాలెం వద్ద కొత్త రోడ్డు బీటలు వారింది. పాత రోడ్డును అలాగే వదిలేసి తారు వేయడం వల్ల బీటలు వారిందని పలువురు చెబుతున్నారు. పాతరోడ్డును పగలగొట్టి కొత్తగా నిర్మిస్తే బీటలు వారేది కాదంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే నాణ్యత పాటించలేదని చెబుతున్నారు.


భరతవానిపాలెం వద్ద బీటలు వారిన రోడ్డు

'దేశానికి మోదాని ముప్పు' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-బొబ్బిలి

దేశానికి మోదాని ముప్పు పుస్తకాన్ని స్థానిక సిఐటియు కార్యాలయంలో గురువారం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.శంకరరావు, మండల నాయకులు ఎస్.గోపాల్, బి.చిరంజీవి, గోపి, కె.మణికుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పి.శంకరరావు మాట్లాడుతూ ప్రధాని మోడీ దన్నుతో అదాని దేశంలో ప్రతి అంగుళాన్ని సొంతం చేసుకోవడానికి కుట్ర పన్నుతున్నారని తెలిపారు. ప్రకృతి వనరులను కైవశం చేసుకోవడమే లక్ష్యంగా పావులు కదుపుతున్నారని చెప్పారు. రాష్ట్రంలోనూ సిఎం జగన్ అండగా రాష్ట్ర సంపదపై కన్నేశారని తెలిపారు. అదాని వజ్రాల వ్యాపారంతో మొదలై, మోడీ దన్నుతో అవినీతి, మోసాలకు పాల్పడి, ప్రపంచ కుబేరుల్లో ఒకడిగా ఎలా ఎదిగాడో ఈ పుస్తకంలో ఆర్థికవేత్తలు రాశారని, ప్రతిఒక్కరూ ఈ పుస్తకాన్ని చదవాలని కోరారు.

సర్పంచ్‌కు విలువ ఇవ్వని తహశీల్దార్!

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని వావిలిపాడు సర్పంచ్ బీల రాజేశ్వరి తనకు అధికారులు విలువ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో వచ్చిన ఫిర్యాదులపై దర్యాప్తు చేసినపుడు తనకు అధికారులు సమాచారం ఇవ్వడం లేదని మండి పడ్డారు. ఇదే విషయంపై గతంలో జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కూడా అధికారులకు ఆదేశాలు జారీ చేసిన తహశీల్దార్ కృష్ణంరాజు మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. కేవలం డబ్బులు దండు కోవడం కోసమే రెవెన్యూ సిబ్బంది, అధికారులు పనిచేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా గ్రామంలో దర్యాప్తు చేస్తున్న సమయంలో సర్పంచ్‌కు సమాచారం ఇవ్వకపోతే ఉన్నతాధికారులకు, రాజకీయ పెద్దలకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.


సర్పంచ్ రాజేశ్వరి

బహిరంగంగా బెల్ట్ షాపుల వేలం

ప్రజాశక్తి - వేపాడ

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో బెల్టుషాపులకు వేలం పాటలను నిర్వహిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్ శాఖ కన్నెత్తి కూడా చూడటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల అరిగి పాలెంలో, సింగరాయ, డిఆర్‌పేట, బల్లంకి గ్రామాల్లో సుమారు రూ. 2లక్షలకు పైగా వేలం పాట పాడినట్లు తెలిస్తోంది. ఆతవలో రూ. 80వేలకు పాటను దక్కించుకున్నారు. బాణాదిలో అత్యధికంగా ఎనిమిది మంది పోటీ పడగా ఒక వ్యక్తి రూ.5.50లక్షలకు వేలం పాటను దక్కించుకున్నట్లు తెలిస్తోంది. ఆయా గ్రామాల్లో పంచాయతీల్లో కూడా మద్యం అమ్మకాలకు తీర్మానం జరిగినట్లు తెలిస్తోంది. ఈ విధానం అధికార పార్టీ సర్పంచులు ఉన్న చోటే జరగడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. పైగా ఎవరైనా ఫిర్యాదు చేస్తే వారి అంతు చూస్తామని బెదిరిస్తున్నట్లు సమాచారం. మద్యపాన నిషేధమని చెప్పి ఇప్పుడు వైసిపి నాయకులు గ్రామాల్లోనే మద్యం అమ్మించడం పట్ల మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఎక్సైజ్ సిఐని ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు.

గిరిజన గ్రామాల్లో సిఐ పర్యటన

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం : ఎల్విన్‌పేట సిఐ పి.సత్యనారాయణ గురువారం ఆంధ్రా- ఒడిశా సరిహద్దు గిరిజన గ్రామాలైన వంగర, కేసర, డోలుకొన, కేసరి గూడ, సందిగూడ తదితర కొండ శిఖర గిరిజన గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గిరిజనులతో సమావేశాలు నిర్వహించి, వారి సమస్యలైన కనీస మౌలిక వసతుల కల్పన తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. గిరిజన నిరుద్యోగ యువతను కలిసి వారికి ఉద్యోగ, ఉపాధి కల్పన శిక్షణ కార్యక్రమాలు, తదితర అంశాలపై చర్చించారు. ఈ మేరకు తాను సేకరించిన వివరాలను తమ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని గిరిజనులకు హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎస్ఐ షణ్ముఖరావు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నేరాలు ఘోరాలు

వృద్ధుడు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండల కేంద్రంలోని తూముల అప్పల స్వామి అనే వృద్ధుడు మతిస్థిమితం లేకపోవడంతో విచిత్రంగా ప్రవర్తిస్తుంటాడు. గురువారం అతని ప్రవర్తనతో కుటుంబసభ్యులు విసుక్కోవడంతో మనస్థాపం చెంది, ఇంట్లో ఉన్న పురుగుమంది తాగి ఆత్మ హత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబసభ్యులు 108 వాహనంలో జిల్లా అస్పత్రికి తరలించగా, వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

వేధింపులు తాళలేక మహిళ..

ప్రజాశక్తి-మక్కువ

మండలకేంద్రంలోని స్థానిక పిహెచ్‌సి సమీపంలో నివాసముంటున్న శ్రీకాకుళం కనకమహాలక్ష్మి ..భర్త శ్రీనివాసరావు వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇంట్లో ఉన్న చీమల మందును తాగడంతో అపస్మారక స్థితికి చేరుకుంది. వెంటనే ఆమెను పార్వతీపురం కేంద్రాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతుంది. కనక మహాలక్ష్మి ఫిర్యాదు మేరకు భర్త శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మక్కువ మండలం మార్కొండపుట్టికి చెందిన లావేటి పోలినాయుడు, ఆతని వదినతో కలసి గురువారం ఉదయం ద్విచక్ర వాహనంపై పార్వతీపురం వస్తుండగా వెంకంపేట ఘోరీల దగ్గర ఎదురుగు వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో గాయపడ్డారు. స్థానికులు వెంటనే 108 వాహనంలో జిల్లా అసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

ఘనంగా శ్రీరామనవమి వేడుకలు


బొబ్బిలి.. సీతారాముల కళ్యాణం చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి దంపతులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

శ్రీరామనవమిని పరిష్కరించుకొని నగరంలోని వివిధ ప్రాంతాలలో నిర్వహించిన సీతారాముల కళ్యాణ మహోత్సవాలలో డిప్యూటీ స్పీకర్ కొలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. 42వ డివిజన్ పాల్ నగర్ ప్రాంతంలో రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సీతారామ కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్చార్జి డాక్టర్ వి.ఎస్ ప్రసాద్, కార్పొరేటర్ దాసరి సత్యవతి, అసోసియేషన్ అధ్యక్షులు కెవి నాయుడు, కార్యదర్శి పప్పు విశ్వనాథం, అప్పలనాయుడు, దేవుడు, మహేష్, వంతరం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తోటపాలెంలో.. రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. సీతారాముల కల్యాణానికి డిసిఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన, వైసిపి యూత్‌వింగ్ జోనల్ ఇన్‌ఛార్జి అవనాపు విక్రమ్, వైసిపి నాయకులు బొత్స లక్ష్మణరావు, స్థానిక వైసిపి నాయకులు భోగాపురం రవిచంద్ర తదితరులు హాజరయ్యారు. ఆలయ నిర్వాహకులు, కమిటీ సభ్యులు వారికి సాదర స్వాగతం పలికారు. కార్యక్రమంలో పతివాడ సత్యనారాయణ, ఆర్లె కృష్ణారావు, తోమురోతు గురునాధరావు, కోరాడ అప్పలనరసయ్య, కంది సురేష్, గేదెల అప్పారావు, మారేష్, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

రామనారాయణంలో.. ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామనారాయణంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం 6:30గంటలకు సీతారాములకు పంచామృత అభిషేకాలు, 11గంటలకు రామతారక మంత్ర హోమం , సాయంత్రం 5గంటలకు సీతారాముల కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు వందలాది మంది భక్తులు హాజరయ్యారు. 7.30 గంటలకు ఊంజల్ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సిఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్, ఎంఎస్ రామారావు మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పి.శ్రీనివాసస్వామి, నారాయణం సీతారామయ్య, రామనారాయణం అర్చకులు పివిజె చాణక్య తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం కోట : నగరంలోని సాయినాథ్ కాలనీ సత్య సాయి ఓంమందిరం సమితి లో శ్రీరామ నవమి ఉత్సవాలు జరిగాయి. సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా భగవాన్ సత్య సాయి జిల్లా అధ్యక్షులు సునీల్ కుమార్ రథో, పూర్వ అధ్యక్షులు చొక్కాపు దామోదర రామ్మోహనరావు, ఆంజనేయులు హాజరయ్యారు. కన్వీనర్ జి.సన్యాసినాయుడు ఆధ్వర్యాన కార్యక్రమాలు నిర్వహించారు.

రేగిడి : మండలంలోని ఉంగరాడ, దేవుదల, సంకిలి, తునివాడ, రేగిడి తదితర గ్రామాల్లో గురువారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉంగరాడలో సర్పంచ్ చల్ల భుజంగరావు, శోభారాణి దంపతులు, దేవుదలలో కెంబూరు కుటుంబ సభ్యులు.. రాముల వారి కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేశారు.

వేపాడ : మండలంలో సింగరాయి, ఆతవ, పాటూరు, అరిగిపాలెం, సోంపురం, వేపాడ, బల్లంకి, బానాది, ఎన్‌కెఆర్‌పురం, వీలుపర్తి, తదితర గ్రామాల్లో సీతరాముల కళ్యాణాలను వైభవంగా నిర్వహించారు. పాటూరులో పట్టువస్త్రాలను ఎన్ఎన్ఆర్ కనస్ట్రక్షన్ గ్రూప్ అధినేత నంబూరి రవికుమార్ సమర్పించారు. బల్లంకి రామాలయంలో టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, బానాది ఎంపిటిసి గొంప తులసి దంపతులు, ఉపసర్పంచ్ ధనుంజయ్, మాజీ సర్పంచ్ గొర్లె నాగరాజు, గొర్లె దేముడు, కె.పి.నాయుడు.. పూజలు చేశారు. ఎన్‌కెఆర్‌పురంలో డిసిసిబి చైర్మన్ వివి చినరామునాయుడు కోలాట బృందానికి ఒక్కొక్కరికి రెండు జతలు చొప్పున దుస్తులు అందజేశారు. బొద్దాం రామాలయానికి పిల్ల వెంకటరమణ, ముమ్మన గణేష్, ఆర్.జోగినాయుడు, కర్రి సన్యాసిరావు రూ.80 వేలు విలువైన మకర తోరణాలను వితరణ చేశారు. ఆయా గ్రామాల్లో అన్నదానాలను, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేశారు.


కొత్తవలస.. నవమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

బొబ్బిలి : పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో శ్రీరామ నవమి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. పక్కిలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు, చిన్నమ్మి దంపతులు సీతారాముల కళ్యాణం నిర్వహించారు.


బాడంగి : మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామనవమిని ఘనంగా నిర్వహించారు. సీతారాముల కళ్యాణాలను నిర్వహించి, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేశారు.

కొత్తవలస : మండలంలోని రామలింగాపురం గ్రామంలో శ్రీరామ నవమి సందర్భంగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పూజలు చేశారు. కార్యక్రమంలో కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, వైసిపి వేపాడ మండల అధ్యక్షుడు ఎం.జగన్నాథం, రామలింగాపురం సర్పంచ్ నెక్కల గౌరినాయుడు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో రాములోరి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం 1500 మందికి అన్నదానం చేశారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు సుధారాజు దంపతులు పట్టణంలోని బ్రాహ్మణవీధిలో కోదండ రామాలయానికి వెళ్లి పట్టు వస్త్రాలను సమర్పించారు.


రామనారాయణంలో నిర్వహిస్తున్న సీతారాముల కళ్యాణం


వేపాడ.. బల్లంకిలో పూజలు చేస్తున్న గొంప వెంకటరావు, తులసి, తదితరులు


బాడంగి.. శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొన్న ముగడ గ్రామస్తులు

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-వంగర

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలపై ఏప్రిల్ 5న చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్.రామ్మూర్తి నాయుడు కోరారు. రాజాంలో గురువారం చలో ఢిల్లీ పోస్టరును ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ హక్కులను కేంద్రం కాలరాస్తోందని ధ్వజమెత్తారు. అదేమని అడిగిన వారిని జైళ్లకు పంపిస్తోందన్నారు. ప్రజావ్యతిరేక విధానాలకు ఎదురు తిరగకుండా చూసుకోవటానికి మతం పేరుతో ప్రజలను విడగొట్టి పరిపాలిస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు. కార్మికులను యజమానులకు బానిసలుగా మార్చేందుకు లేబర్ కోడ్లను తీసుకొచ్చిందన్నారు. మరోవైపు కనీస వేతనం నెలకు రూ.26 వేలు, కనీస పింఛను రూ.10 వేలు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, టైమ్ స్కేల్, డైలీవేజ్, గౌరవ వేతనం, కార్మికుల పర్మినెంట్, అందరికీ సామాజిక భద్రత, తదితర డిమాండ్లను మోడీ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తోందని చెప్పారు. వీటిపై చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమానికి పెద్దఎత్తున కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజేష్, కృష్ణ, కనకరాజు, గిరి, చినబాబు, అచ్యుతరావు, శ్రీనివాసరావు, వెంకట్, అప్పలరామ్, శంకర్రావు, తదితరులు పాల్గొన్నారు.


చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

వేపాడ : ఏప్రిల్ 5న ప్రజాసంఘాలు చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా పూర్వ కార్యదర్శి చల్లా జగన్ కోరారు. సోంపురం క్వారీ కూడలి వద్ద గురువారం ఆయన ప్రచారం చేపట్టారు. మోడీ ప్రభుత్వం కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలు అమలు చేస్తోందన్నారు. దీన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యనమల రమణ, సతీష్, వెంకటరమణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ పనులు పరిశీలన

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలో బలిజిపేట రోడ్డులో చేపడుతున్న నూతన పైపులైన్ పనులను గురువారం పబ్లిక్ హెల్త్ ఇఇ దక్షిణామూర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన పైపులైన్ పనులు వేగవంతం చేయాలన్నారు. పట్టణ ప్రజలకు సంపూర్ణంగా తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. లీకులను నివారించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు.


పైపులైను పనులను పరిశీలిస్తున్న ఇఇ దక్షిణామూర్తి

ప్రజలకు వైద్య సేవలతోనే సంతృప్తి

సిహెచ్‌సి వైద్యులు శోభారాణి

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రజలకు వైద్య సేవలు అందించామనే సంతృప్తి ఉందని సిహెచ్‌సి వైద్యులు కెకెవి శోభారాణి అన్నారు. శుక్రవారం ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా ఆమె 'ప్రజాశక్తి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆమె మాటల్లోనే..

మాది కృష్ణా జిల్లా వీరవల్లి. తండ్రి కె.రామచంద్రరావు పశుసంవర్ధక శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేయడంతో నా విద్యాభ్యాసం చోడవరం, విశాఖ, అనకాపల్లి, పిఠాపురంలో సాగింది. ఒకటి నుంచి మూడో తరగతి వరకు చోడవరం, నాలుగో తరగతి విశాఖ, ఐదు నుంచి పదో తరగతి అనకాపల్లి ప్రభుత్వ పాఠశాలలో చదివాను. ఇంటర్మీడియట్ పిఠాపురం ఆర్.ఆర్.బి.హెచ్.ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, విశాఖ ఆంధ్రా మెడికల్ కళాశాలలో 1976-1981లో ఎంబిబిఎస్ పూర్తిచేశాను. ఉద్యోగం చేస్తూ డిప్లొమో ఎనస్థీషియా పిజి 2007 - 2009లో అభ్యసించాను. 1988లో మెడికల్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించి 1989 వరకు గర్బాం పిహెచ్‌సిలో, అనంతరం 1992 వరకు బలిజిపేట పిహెచ్‌సిలో వైద్యసేవలు అందించాను. 1993-94 వరకు బొబ్బిలి పిహెచ్‌సిలో, 1995 నుంచి 2014 వరకు పిరిడి పిహెచ్‌సిలో, 2015 నుంచి నేటి వరకు బొబ్బిలి సిహెచ్‌సిలో విధులు నిర్వర్తించాను. కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు బాగా చేయడంతో మూడు సార్లు ఉత్తమ మెడికల్ ఆఫీసర్‌గా అవార్డులు అందాయి. భర్త గొట్టాపు బలరాం నాయుడు వైద్యులు కావడంతో నేను విధులు సక్రమంగా నిర్వహించేందుకు సంపూర్ణంగా సహాయ సహకారాలు అందించారు. కుమారుడు జివిఎస్ శశికాంత్ అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. కోడలు సిహెచ్ శిరీష్ అప్లయిడ్ కెమిస్ట్రీలో ఎమ్మెస్సీ పూర్తి చేశారు. కుమార్తె జి.నిహారిక గైనకాలజిస్ట్‌గా, అల్లుడు శ్రీకాంత్ చిన్నపిల్లలు వైద్యులుగా వైద్య సేవలందిస్తున్నారు. మాతా శిశు సంరక్షణకు పని చేయడం మంచి సంతృప్తినిచ్చింది.



దృష్టిలోప నివారణకు 'ఆర్థో-కె' మేలు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

దృష్టిలోప నివారణకు సరికొత్త విధానం అమల్లోకి వచ్చిందని ప్రొఫెషనల్ సర్వీసెస్ సిల్వర్ లైన్ లేబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ గగన్ సాహ్ని అన్నారు. ప్రపంచ ఆప్టోమెట్రీ దినోత్సవాన్ని పురస్కరించుకొని సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల వర్క్‌షాపును గురువారం వైస్ ఛాన్సలర్ జిఎస్ఎన్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా గగన్ సాహ్ని మాట్లాడుతూ గతంలో దృష్టిలోప నివారణకు కళ్లద్దాలు ఉపయోగించేవారమని, ఆ తరువాత కాంటాక్టు లెన్స్ అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఇటీవల కొత్తగా ఆర్థో కెరటాలజీ (ఆర్థో-కె) విధానం అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ విధానంలో శస్త్రచికిత్స లేకుండా కేవలం రాత్రి పడుకునేటప్పుడు లెన్స్ పెట్టుకొని నిద్రిస్తే ఉదయం లేచే సరికి కార్నియాను సరిచేస్తుందన్నారు. పగలు లెన్స్ లేకుండా మనం చూడగలుగుతామని వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో సెల్ ఫోన్, కంప్యూటర్ వాడకం పెరిగిందన్నారు. దీనివల్ల కంటికి భారం లేకుండా ఉండాలంటే ప్రతి 20 నిమిషాలకు ఒకసారి స్క్రీన్ చూడటం ఆపి 20 సెకన్లపాటు 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువులను చూడాలన్నారు. ఆ విధంగా పనిచేస్తే కంటిపై భారం పడకుండా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ పిఎస్‌వి రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ఎస్ వర్మ, పారా మెడికల్ డీన్ డాక్టర్ ఎం.లక్ష్మీనరసింహ, విభాగాధిపతి శ్రావణి, అధ్యాపకులు నాగుల దినేష్‌కుమార్, సౌరజిత్ కుమార్ బెనర్జీ, శ్యామల ఆలనా తేజ, పడాల ఈశ్వర్ పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న గగన్ సాహ్ని


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తూముల అచ్యుతవల్లి

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తూముల అచ్యుతవల్లి ఇంటి వద్ద నైటింగేల్ మహిళా వెల్ఫేర్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అచ్యుతవల్లి మాట్లాడుతూ పట్టణంలో వాటర్ ప్యాకెట్లపై నిషేధం ఉండడంతో గ్రామీణ ప్రాంతాల నుంచి వస్తున్న ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. వేసవిలో అలాంటి ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో నైటింగేల్ క్లబ్ కార్యదర్శి విజయలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

కురుపాం విద్యార్థుల ప్రతిభ

కురుపాం : చిరుధాన్యాలపై డివిజన్, జిల్లా స్థాయిలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.స్వప్నిక 9వ తరగతి విద్యార్థిని ద్వితీయ స్థానం , కె. లక్ష్య 8 వ తరగతి విద్యార్థి తృతీయ స్థానం లో నిలిచి బహుమతులు పొందినట్లు ప్రధాన ఉపాధ్యాయులు టి. శంకరరావు తెలియజేశారు. ఈ సందర్భంగా వారికి పాఠశాల పేరు ప్రతిష్టలు జిల్లా స్థాయిలో నిలిపినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ అభినందించినట్లు తెలిపారు.

గ్లోబల్ పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-గుర్ల

మండలంలోని గుజ్జంగివలస గల గ్లోబల్‌పాఠశాలలో బుధవారం రాత్రి వార్షికోత్సవ వేడుకలు ఘనంగాజరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఇఒ భాను ప్రకాష్, గుర్ల ఎస్ఐ శిరీష, ఐఒబి మేనేజర్ సింహాచలం, గరివిడి ఫేకర్ మేనేజర్ రెడ్డి భాస్కరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు విలువలతో కూడిన విద్యా విధానం నేర్పించాలని కోరారు, అలాగే ప్రస్తుతం మొబైల్ ఫోన్లు వాడకం, టివి వాడకం వల్ల విద్యావ్యవస్థ దెబ్బతినే అవకాశముందని, వాటికి దూరంగా పిల్లలను ఉంచాలని తల్లి దండ్రులకు సూచించారు. విద్యాప్రమాణాలు మెరుగుపడాలంటే విద్యార్థుల్లో ఆత్మ స్థైర్యం, క్రమ శిక్షణ, పోటీ తత్వం అలవర్చు కోవాలని పేర్కొన్నారు. ఈ సంధర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రెడ్డి మురళీధరరావు, పాఠశాల సిబ్బంది, పిల్లల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు రెడ్డి అప్పల నరసయ్య, అట్టాడ రామకృష్ణ, వెంప డాపు సూర్య నారాయణ, అట్టాడ అప్పలరాజ, చిన్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న ఎంఇఒ భానుప్రకాశ్


చీరలు పంపిణీ చేస్తున్న సింహాచలం కుటుంబ సభ్యులు

చీరలు పంపిణీ

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలోని కంటకాపల్లి పంచాయతీ కొత్తూరు గ్రామంలో వంద మంది మహిళలకు జాగరపు సింహాచలం కుటుంబ సభ్యులు శ్రీరామనవమి సందర్భంగా చీరలు పంపిణీ చేశారు. మాజీ ఎంపిటిసి మిడతన కాశీ విశ్వనాథరావు, జాగరపు సింహాచలం, జాగరపు అప్పలనరసమ్మ, విష్ణు, కుసుమ, తదితరులు పాల్గొన్నారు.